క్లుప్తంగా

గొడవలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న అర్బన్ సీఐ శ్రీనివాసులు

కణేకల్లు: గొడవలు చేసినా, ఘర్షణలను ప్రేరేపించినా చర్యలు తప్పవని రాయదుర్గం అర్బన్ సీఐ శ్రీనివాసులు, కణేకల్లు ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలను హెచ్చరించారు. శుక్రవారం ఉదయం మండలంలోని ఎన్.హనుమాపురంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కూడేరు: గర్భంలోని శిశువు ఎదుగుదల ప్రతి నెలా బాగుండాలంటే ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా మలేరియా సహాయ అధికారి సత్యనారాయణ

ఉరవకొండ: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రజలు దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా సహాయ అధికారి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డితో కలిసి పట్టణంలో పలు మురుగు నీటి కుంటలు, పెద్ద డ్రైనేజీల్లో పారిశుధ్య సిబ్బందితో ఆయిల్‌బాల్స్ వేయించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

వజ్రకరూరులో భారీ వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీవర్షం కురిసింది. ఉరుములు,మెరుపులతో కూడిన భారీవర్షం కురవడంతో వీధుల్లో వర్షపునీరు పారింది. భారీవర్షంతో భూగర్భజలాలు పెరుగుతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు



సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్పపై ఎంపీడీఓ గూడెన్నకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కణేకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్పపై గ్రామ పంచాయతీ సిబ్బంది ఎంపీడీఓ గూడెన్నకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ సిబ్బంది మాట్లాడుతూ మేజర్ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇద్దరు బిల్ కలెక్టర్లు, మేస్త్రీ, అటెండర్‌తోపాటు నలుగురు స్వీపర్లు పనిచేస్తున్నారన్నారు. గతంలో జనరల్ ఫండ్ కింద నుంచి జీతాలు పొందేవారమని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు వస్తున్నాయన్నారు. ఈ పంచాయతీకి డీడీఓగా ఎంపీడీఓను నియమించడంతో ఉద్యోగుల జీత భత్యాల బిల్లులన్నీ మండల పరిషత్ వారు చూడాల్సి ఉందన్నారు. జీతాలు, సరెండర్ లీవ్‌లు, ఇంక్రిమెంట్లు, అరియర్స్ తదితర బిల్లుల బాధ్యత తీసుకున్న సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ నెల 6న పంచాయతీ సిబ్బందికి సరెండర్ లీవు బిల్లులు మంజూరు కాలేదన్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జూన్ 1న హనుమద్ జయంతి

వజ్రకరూరు: మండల కేంద్రంలో జూన్ 1న కోట చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి నిర్వహించనున్నట్లు ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హనుమద్ జయంతి పురస్కరించుకొని ఆలయంలో బిందెసేవ, అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, పూజలు ఉంటా యన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ విత్తన వేరుశనగ



పెద్దముష్టూరు ఆర్‌బీకే వద్ద విత్తన పంపిణీని ప్రారంభిస్తున్న ఏడీఏ పద్మజ



శెట్టూరులో విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఏడీఏ యల్లప్ప



74 ఉడేగోళంలో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభిస్తున్న అధికారులు

రాయదుర్గం రూరల్: మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని 74 ఉడేగోళంలో ఎంపీఈఓ సత్యవతితో కలిసి ఏఓ మహేంద్ర విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 4 వేల క్వింటాళ్ల వేరుశనగ మంజూరు కాగా, మొదటిరోజు 2,400 క్వింటాళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ అందిస్తాం

ఉరవకొండ: అర్హులందరికీ విత్తన వేరుశనగ అందేలా చర్యలు తీసుకుంటామని ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ పద్మజ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దముష్టూరు గ్రామ ఆర్‌బీకే వద్ద విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ శుభకర్‌తో కలిసి ప్రారంభించారు. ఏడీఏ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాలకు సరిపడా వేరుశనగ స్టాక్‌ను ఆర్‌బీకేలకు తరలించామన్నారు. ఏఓ శుభకర్ మాట్లాడుతూ రాకెట్ల, మోపిడి, ఇంద్రావతి గ్రామాల్లో విత్తన పంపిణీ చేశామన్నారు.

ప్రతి రైతుకూ నాణ్యమైన విత్తనం

శెట్టూరు: అర్హత ఉన్న ప్రతి రైతుకూ నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని ఏడీఏ యల్లప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. నేటి నుంచి 13 గ్రామ సచివాలయ పరిధిలో విత్తన పంపిణీ ఉంటుందన్నారు. మండలానికి 4,300 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుతం 1,600 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సంధ్యారాణి, ఏఈఓలు ఆంజనేయులు, లీలావతి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం

బొమ్మనహాళ్: మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో ఏఓ సాయికుమార్ వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 18 నుంచి 610 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 536 క్వింటాళ్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 250 మంది రైతులకు పంపిణీచేసినట్లు తెలిపారు. దర్గాహొన్నూరు, గోవిందవాడ, నేమకల్లు, కల్లుదేవనహళ్లి, గ్రామాల్లో ఎక్కువ స్థాయిలో వేరుశనగ సాగు జరుగుతుందని తెలిపారు.

కుందుర్పి: మండల మండల వ్యాప్తంగా ఉన్న 16 రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్‌బీకేలో తహశీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ మహేష్ విత్తన పంపిణీని ప్రారంభించారు.

కంబదూరు: మండలంలో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించినట్లు ఏఓ జాఫర్ శుక్రవారం తెలిపారు. మొదటి రోజు 835 మంది రైతులకు 750 క్వింటాళ్ల విత్తనకాయను పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని 14 గ్రామ సచివాలయల పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో తహసీల్దార్ ఈశ్వరయ్య, ఏఓ నందకిశోర్, ఏఓ సరిత విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో వేణుగోపాల్‌స్వామి, అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగేంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం

బెళుగుప్ప: మండలంలోని ఆర్‌బీకేల్లో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభమైందని ఏఓ పృథ్వీసాగర్ పేర్కొన్నారు. కాలువపల్లి, రమనేపల్లి, అంకంపల్లి, రామసాగరం, శీర్పి, నరసాపురం, గంగవరం తదితర గ్రామాల్లో ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు సబ్సిడీ విత్తన కాయలు రైతులకు పంపిణీ చేశారు.

సబ్సిడీ విత్తన కాయల పంపిణీ

విడపనకల్లు: మండలంలోని చీలకగురికి, పాలికి, ఉండబండ తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ శుక్రవారం పంపిణీ చేసినట్లు ఏఓ పెన్నయ్య తెలిపారు.

వజ్రకరూరు: మండలంలోని రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏఓ మధుకర్ శుక్రవారం తెలిపారు. ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,400 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు ప్రమీల, సిద్దేశ్వరి, రామకృష్ణనాయక్, వీఏఏ సురేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కూడేరు: అర్హులందరికీ సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ విజయ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీని అధికారులు ప్రారంభించారు. కూడేరులోని ఆర్బీకేలో తహసీల్దార్ రత్న రాధిక, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాలతో కలిసి ఏఓ విజయ కుమార్ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. మండలానికి 1,600 క్వింటాళ్ల వేరుశనగ సరఫరా అయ్యిందని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, ఆర్బీకే సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

శెట్టూరు: వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో గ్రామాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓ, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వర్షాలు అధింగా ఉండటంతో గ్రామాల్లో పాడుబడిన ఇళ్లలో, పశువుల కాపరులు, చెట్ల కింద ఉండకుండా జాగ్రత్తలు తెలియజెప్పాలన్నారు. గ్రామాల్లో లైన్‌మెన్లు అందుబాటులో ఉండి, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు శ్రీనివాసులు, నాగరాజు, తిప్పేస్వామి, రామకృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

సమస్య తలెత్తితే వెంటనే స్పందించండి

కూడేరు: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించాలని తహసీల్దార్ రత్న రాధిక, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఆదేశించారు. శుక్రవారం భారీగా కురిసే వర్షాలకు ముందస్తు చర్యలపై కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రత్న రాధిక, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా మాట్లాడుతూ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగితే సంబంధిత సిబ్బంది అప్రమత్తమై మరో స్తంభాన్ని ఏర్పాటు చేయించి, విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయకుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల్లో టపాసులు, పెట్రోల్ విక్రయిస్తే చర్యలు

కుందుర్పి: దుకాణాల్లో టపాసులు, పెట్రోల్ విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హనుమంతు, ఎస్ఐ వెంకటస్వామి హెచ్చరించారు.శుక్రవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను వారు తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందన్నారు. ఎవరైనా ఆదేశాలను ధిక్కరించి విక్రయాలు కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు.

పెట్రోల్ స్వాధీనం

కంబదూరు: ఎన్నికల కమిషన్‌కు విరుద్ధంగా లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న దుకాణాలపై డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. ఈసందర్భంగా 10 లీటర్ల పెట్రోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వీఆర్ఓ, వీఆర్ఏలు పాల్గొన్నారు.



కంబదూరులో స్వాధీనం చేసుకున్న పెట్రోల్‌తో రెవెన్యూ అధికారులు

ఘనంగా రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి వర్ధంతి

ఉరవకొండ: పోరాట యోధులు, రైతు పక్షపాతి రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి 29వ వర్ధంతి శుక్రవారం ఘనంగా జరిగింది. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో తన తండ్రి రాకెట్ల నారాయణరెడ్డి, సోదరుడు వై.రవీంద్రనాథ్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల కోసం వారు చేసిన పోరాటాలు ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ గుర్తు చేశారు. పేదలకు అండగా నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి చేసిన పోరాటాలు వృథా కావని, ఎంతో కాలం గుర్తుండిపోతాయని, వారు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరన్న, పెద్దిరెడ్డి, అడ్వొకేట్‌లు హరినాథ్‌రెడ్డి, ఉమాపతి, కూడేరు నాయకులు ఎంపీపీ నారాయణరెడ్డి, తుప్పటి హరీష్, బైరెడ్డి రామచంద్రారెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.



రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నాయకులు

వెంకట్‌రెడ్డికి నివాళి

ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్‌రెడ్డి(50) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆమిద్యాలకు చేరుకొని వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకులు తేజోనాథ్, అశోక్, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో పదో తరగతితో పాటు ఇంటర్మీడియెట్ సంప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం సజావుగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏడు కేంద్రాలు, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. టెన్త్ పరీక్షా కేంద్రాలను ఎంఈఓ నాగమణి పరిశీలించారు. టెన్త్ పరీక్షలకు 548 మంది గైర్హాజరు : ప్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, సెయింట్‌పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, పీఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇన్ఫాంట్ జీసస్ స్కూల్‌లోని కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరిగాయి. తొలి రోజు ఏడు కేంద్రాల్లో మొత్తం 1,054 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా, 506 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 6 మంది గైర్హాజరు : పట్టణంలోని రెండు కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన ఫస్టియర్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 77 మందికి గాను 75 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షలకు 74 మందికి గాను 68 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 59 మందికి గాను 59 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ఉరవకొండ: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఉరవకొండ ఎస్ఐ రాఘవేంద్రప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయంపల్లి, నెరిమెట్ల గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు చేయరాదని, గొడవల జోలికి వెళ్లరాదన్నారు. ఎవరైనా గ్రామాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వంద మంది బైండోవర్

విడపనకల్లు: మండల పరిధిలోని గ్రామాల్లో సమస్యాత్మక వ్యక్తులను ఎన్నికల దృష్ట్యా వందమందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ శుక్రవారం తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు కూడా గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అల్లర్లకు పాల్పడినా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రెన్యూవల్ చేసుకోండి

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ వ్యవసాయ సహకార సంఘం సొసైటీ పరిధిలోని రైతులు సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ హనుమంతు శుక్రవారం తెలిపారు.ఆధార్, ఫోన్ నంబర్‌తో సభ్యత్వం రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

వజ్రకరూరు: స్థానిక ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ తిమ్మప్పశుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఇప్పటివరకు 13 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. 1,2 తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు పూర్తిగా వచ్చాయని, 3,4,5,6,7 తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు 50 శాతం వచ్చినట్లు తెలిపారు. 8,9,10 తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు త్వరలో రానున్నట్లు తెలిపారు.

29న బహిరంగ వేలం

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 29న ఉదయం 11గంటలకు జనార్దన వేంకటేశ్వరస్వామి, జనార్దన ఆంజనేయస్వామి, రామేశ్వరస్వామి, చొప్పరం ఆంజనేయస్వామి, చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానాల భూములు కౌలుకు ఇవ్వడానికి వేలం వేయనున్నట్లు ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఓ మాట్లాడారు.

అభాగ్యుడికి అండ

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన మూర్తి అనే వ్యక్తి వెన్నెముక నొప్పితో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్స కోసం రూ.1.5 లక్ష ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతుండగా, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ ఆదుకున్నారు. రూ.30వేల చెక్కు బాధితుడికి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ వాహబ్‌ఖాన్, ట్రస్ట్ సభ్యులు సురేష్, లోకేష్, సాయినాథ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామాంజనమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

విడపనకల్లు: వేసవిలో విద్యుత్, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పుష్పావతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి, విద్యుత్ సమస్య రాకుండా స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, వైస్ ఎంపీపీలు రాకెట్ల పుష్పావతి, మోదుపల్లి సునీత రాణి, అధికారులు, సర్పంచులు,ఎంపీటీసీలు, విడపనకల్లు సొసైటీ చైర్మన్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మీదేవి

రాయదుర్గంటౌన్:మల్లాపురం ఇందిర మ్మకాలనీలో వెల సిన గజలక్ష్మి దేవికి శుక్రవారం పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెన్నహోబిల క్షేత్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం పెన్నహోబిల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 31 వరకు జరగనున్నాయి. 28న బ్రహ్మరథోత్సవం జరగనుంది. నూతన రథం తయారీకి రూ.1.70 కోట్లు వెచ్చించారు. ఐదేళ్లకాలంలో ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఈఓ కె. విజయ్‌కుమార్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెన్నహోబిల క్షేత్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన తెలియజేశారు.



పెన్నహోబిలం ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్

సాక్షి: పెన్నహోబిలంలో భక్తులు, పర్యాటకులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారు?

ఈఓ: పెన్నహోబిలం ఆలయం చుట్టూ దాతల సహకారంతో రూ.కోటి వ్యయంతో రోడ్లు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశాం. మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించాం. భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

సాక్షి: నూతన రథం నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయి?

ఈఓ: నూతన రథానికి రూ.1.78 కోట్లు వెచ్చించాం. రథం నిర్మాణ పనులను రివర్స్ టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించాం. 43 అడుగుల రథం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు నూతన రథం నిర్మాణం పూర్తవుతుంది.

సాక్షి: భక్తుల కోసం ఎలాంటి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఈఓ: భక్తుల వసతి సౌకర్యార్థం దేవదాయ శాఖ ఇంజినీర్లతో కాటేజీలు, వసతి గృహాల నిర్మాణాలకు ప్లాన్లు వేయించి, వాటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే దాతల సహకారంతో పలు కాటేజీలు నిర్మించాం.

సాక్షి: దేవస్థానంలో భద్రతకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఈఓ: దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కోసం 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆలయం కింది భాగంలో పోలీసు అవుట్ పోస్టు పోలీసుశాఖ తరపున ఏర్పాటు చేశారు.

సాక్షి: వేలం పాట ద్వారా ఆదాయం సమకూరుతుందా?

ఈఓ: స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరిచిప్పల వేలం ద్వారా ఆలయానికి రెండింతల ఆదాయం పెరిగింది. దీంతో పాటు ఆలయ హుండీ కానుకల ఆదాయం 2021–22కు రూ.66 లక్షలు, 2022–23కు రూ.1.27 కోట్లు ఆదాయం పెరిగింది. దీంతో పాటు 2022–23 ఆలయ భూముల కౌలు వేలం ద్వారా రూ.10లక్షలు వసూలు అయ్యింది.

సాక్షి: సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఈఓ: ఆలయంలో స్వామి వారి దర్శనం సామాన్య భక్తులకు కల్పించేలా దర్శనం టికెట్లు మొత్తం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందే అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో జోరుగా క్రికెట్ బెట్టింగ్

- యువత, క్రీడాభిమానులకు ప్రీమియర్ లీగ్ ఫీవర్
- ఫైనల్‌కు చేరుకున్న ఐపీఎల్ మ్యాచ్‌లు

రాయదుర్గం: రాజకీయ నాయకులకు సార్వత్రిక ఎన్నికల ఫలితాలపైనా, యువత, క్రీడాభిమానులకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫీవర్ పట్టుకుంది. ఓ వైపు పలాన పార్టీ అభ్యర్థే గెలుస్తారని.. కాదు ఆ పార్టీ అభ్యర్థికే ఎక్కువ మెజార్టీ రావొచ్చు..లేదు లేదు ఈ పార్టీకే అధిక మెజార్టీ సాధిస్తుంది అని బెట్టింగులు కాస్తుంటే..ఐపీఎల్ మ్యాచ్‌లు ఫైనల్‌కు చేరడంతో యువత బంతి బంతికో రేటు కట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో కర్ణాటక సరిహద్దులోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో యువతకు ఐపీఎల్ ఫీవర్ పట్టుకుంది. వాట్సాప్ గ్రూపుల్లోనే రాయబేరాలు సాగిస్తున్నారు. పోలీసులు కాస్త ఎన్నికల బిజీలో ఉండిపోవడంతో బెట్టింగ్ రాయుళ్ల ఆట కట్టించలేకపోయారు. దీంతో ఆడిన వాళ్లకు ఆడినంతలా అన్నట్లు బెట్టింగ్ తయారైంది. రాయదుర్గంలో రెండేళ్ల క్రితం ఐపీఎల్ సీజన్‌లో ఏకంగా రూ.50 కోట్లకుపైగా టర్నోవర్ జరిగిందనే ఆరోపణలు అప్పట్లో షికార్లు చేసింది. ఈ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఉంచిన జిల్లా ఎస్పీ.. బెట్టింగ్ స్థావరాలపై అప్పట్లో ఉక్కుపాదం మోపారు. స్థానిక పోలీసులకు తెలియకుండానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక టీమ్ ద్వారా కూపీ లాగారు. పలువురిని అదుపులోకి తీసుకొని కట్టడి చేశారు.

బంతి బంతికీ ఓ రేటు :

గతంలో ఐపీఎల్, ఇతర బెట్టింగ్‌ల కోసం ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు చెందిన వారే ప్రధాన బుకీలుగా ఉండేవారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలకు విస్తరించారు. బెట్టింగ్ కాయాలనుకునే వారు ముందుగా బుకీలకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు పంపిస్తే, వారు ఆ వ్యక్తి కాసిన జట్టుపై బెట్టింగ్ నమోదు చేసుకుంటారు. ఒక వేళ బెట్టింగ్‌లో గెలిస్తే, ఆ మొత్తాన్ని బుకీ నుంచి నేరుగా లేదా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తీసుకుంటారు. అయితే ఈ వ్యవహారం అంతా ఫోన్ ద్వారా జరుగుతోంది. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో బెట్టింగ్‌లకు పాల్పడే వారు రహస్య ప్రాంతాల్లో మకాం వేసి ఫోన్లలోనే లావాదేవీలు సాగిస్తున్నట్లు తెలిసింది. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనే దానితో పాటు ప్రతీ బాల్‌కు రన్‌పై, వికెట్‌పై బెట్టింగ్ ఆడుతున్నారు. ఈ ఆట మొత్తం ఆన్‌లైన్‌లోనే సాగుతుండడంతో పోలీసులకు పట్టుబడకుండా జాగ్రత్త వహిస్తున్నారు.

నిఘా పెంచాం

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్నీ రకాల బెట్టింగుల పై నిఘా పెంచాం. ఎన్నికల ఫలితాలు దగ్గపడడం, ఐపీఎల్ లీగ్ చివరి దశకు చేరడం లాంటి కారణాలు వెరసి బెట్టింగ్ రాయుళ్ల పై ఉక్కుపాదం మోపాం. ఓ పక్క ఎన్నికల విధులు నిర్వహిస్తునే మరో పక్క ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టాం. బెట్టింగుల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవడం మంచిది కాదు. పిల్లలపై తల్లిదండ్రులు ఈ రెండు మ్యాచ్‌లు ముగిసే వరకూ ఓ కన్నేసి పెట్టాలి. సాంకేతికంగాను పరిశీలించేలా చర్యలు చేపడతాం. పట్టుబడితే ఎంతటి వారైనా సరే జైలుకు పంపుతాం.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం